కథ

# బ్రతికిపోయావు పో!

టి.ఎస్.ఎ. కృష్ణమూర్తి

నాకిష్టమైన రాయల్ యూత్ క్లబ్ సెంటు పరిమళం సమీపించేసరికి ఆసక్తిగా తలపైకెత్తిన నా కళ్ళు జిగేలుమన్నాయి.

ఓ మెరుపుతీగలాగా ఆమె అలవోకగా వచ్చి నా టేబిలు ఎదుట ఉన్న కుర్చీలో కూర్చోవడం ఓ అద్భుతం అన్పించింది నాకా క్షణాలలో.

''చెప్పండి!'' అన్నాను ఉత్సాహంగా కాస్త ముందుకు వంగుతూ.

''మా బంధువు..శంకర్రావుగారని...నూనెమిల్లు యజమాని...రెన్యూవల్‌కు అప్లయి చేశారు. ఆయన బాగా పెద్దాయన, ఎన్నిసార్లు తిరిగినా మీ ఆఫీసునుండీ రెన్యూవల్ అందడం లేదు'' అందామె నవ్వి.

సంబంధిత సెక్షన్ ఆఫీసరు నేనయినా ఇన్స్పెక్షన్ చెయ్యాల్సిందీ, రిమార్కులు పంపాల్సిందీ ఇంకో అధికారి. కానీ అంత అందంగా, ఆకర్షణీయంగా ఆమె అలా నవ్వుతూ మాట్లాడుతోంటే నేను ఇంట్రస్టు తీసుకోకుండా ఉండలేకపోయాను. అటెండర్ను పంపించి ఆ ఫైలు తెప్పించాను. అప్లికేషన్ ప్రాసస్ సక్రమంగానే వున్నా దాదాపు రెండు నెలలుగా ఏ రిమార్కులూ లేకుండా మూలపడి నలుగుతున్నట్లు కన్పించింది.

''నాలుగు రోజులాగి రండి..ఆలోగా రెన్యూవల్ చేయిస్తాను!''

ఆమె మరింత మనోహరంగా నవ్వి కృతజ్ఞతలు తెలిపి వెళ్ళిపోయింది.

ఆరోజంతా ఆమె రూపం కళ్ళముందు మెదుల్తూనే ఉంది.

★ ★ ★

త్వరగా ఇన్స్పెక్షన్ తంతు ముగించి రిమార్కులు ఫేవరుగా రాసి పంపమని ఇన్‌స్ట్రక్షన్స్ ఇచ్చాను. కానీ ఆ ఉద్యోగి రిమార్కులు రాయక మునుపే ఏదో అత్యవసర పనిమీద శెలవులో వెళ్ళడంతో ఆ పని అలా ఆగిపోయింది.

కానీ సరిగ్గా నాలుగు రోజుల తరువాత.. నేనేదో పని తొందరలో ఉండగా హఠాత్తుగా నాకిష్టమైన సువాసన...ఆనందంగా, ఆసక్తిగా తలపైకెత్తాను.

అపురూపమైన రూపలావణ్యాలకు మరింత మెరుగులు దిద్దిన అలంకరణలతో ఆమె అలా వచ్చి నా ఎదురుగావున్న కుర్చీలో కూర్చుంది.

''ఐయాం సారీ మేడం..కన్సండ్ ఎంప్లాయీ లీవులో ఉన్నారు. ఇంకో రెండు మూడు రోజులు ఓపిక పట్టాలి మీరు!'' అన్నాను.

ఆమె కాస్త నిరుత్సాహపడింది. కానీ చిరునవ్వుతోటే శెలవు తీసుకుంది.

ఇహ ఆరోజు కూడా ఆమె రూపం నా మనసులోంచీ కదలడం లేదు. ఇల్లు చేరాక..కళ్ళముందు నా భార్యాపిల్లలు కదులుతున్నా కూడా.

పదే పదే ఆమె రూపం కళ్ళముందు మెదలడమే కాదు అనేక పరిమళాలు నన్ను చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేసినట్లుగా అనుభూతి చెందుతూ కూర్చున్నాను చాలా రాత్రి వరకూ.

★ ★ ★

ఆ ఉద్యోగి శెలవు పొడిగించుకోవడం వల్ల ఆమెకిచ్చిన రెండు మూడు రోజుల మాట కూడా తప్పాను. మరో రెండు రోజులు ఆలస్యంగానే ఐదు రోజుల తర్వాత ఆమె వచ్చినా నేను ఏమీ చెయ్యలేకపోయాను. ఆ ఉద్యోగి తన బీరువా తాళం చెవులను ఎవరికీ అప్పగించి వెళ్ళకపోవడం వల్ల! అటెండరు అన్నయ్యను పంపించి మంచి టీ తెప్పించాను. నిజం చెప్పాలంటే ఆమె నా ముందు అలా కూర్చోవడం నాకెందుకో చాలా యిష్టంగా వుంది.

''మీరో పని చెయ్యండి..మీ ఫోను నెంబరు



ఇచ్చి వెళ్ళండి. మీ పనవగానే ఫోను చేసి చెప్తాను!'' అన్నాను ఆమె టీ తాగిన పిదప.

''మీకు శ్రమ ఇస్తున్నాను!'' అంటూ నవ్వి తమ ఫోనునెంబరు చెప్పింది ఆమె! నేను చకచకా రాసుకున్నాను.

ఆమె వయ్యారంగా నడచుకుంటూ వెళ్ళిపోతోంటే ఆమె రూపం నా గుండెలోతుల్లో ముద్ర పడడానికి చొచ్చుకు వెళ్ళే ప్రయత్నం సాగిస్తోంది.

ఆమె రూపం వెన్నాడుతూనే ఉండడం వల్ల ఆమె కోరిన పని పూర్తయేవరకూ సరిగ్గా నిద్రపోలేకపోయాను ఆమె తలపులతో.

★ ★ ★

పర్మిషన్ గ్రాంటయి, లైసెన్సు రెన్యూవల్ అవగానే ఆ కాగితాలు తెప్పించుకుని ఆమె ఇంటికి ఫోను చేశాను.

''హలో!'' అంటూ గంభీరంగా విన్పించిందో పురుషస్వరం అవతలినుండీ. అప్పుడు కానీ ఆమె పేరు తెలుసుకోకుండా కాలం గడిపిన నా అజ్ఞానం స్ఫురణకు రాలేదు.

''మేడం గారున్నారాండీ?'' జంకుతూ ప్రశ్నించాను.

''వసుధా! నీకు ఫోన్!'' అతని స్వరం కాస్త పెద్దగా విన్పించిన నిముషం తరువాత ఆమె స్వరం మధురంగా విన్పించింది.

''నేనండీ.. సెక్షన్ ఆఫీసరు రాజారావు.. మీరు కోరిన లైసెన్సు రెన్యూవల్ అయి సిద్ధంగా ఉంది. వచ్చి తీసుకు వెళ్ళవచ్చు'' అన్నాను.

''చాలా థాంక్సండీ... మధ్యాహ్నం మూడు గంటలకు వస్తాను!''

★ ★ ★


మూడు గంటలకు బాగా ముందే వచ్చి సీట్లో కూర్చుని అన్నయ్యను పంపించి ఫ్లాస్కులో రాజస్థానీ టీ తెప్పించాను.

మూడుంపావుకు వచ్చింది రాయల్ యూత్ క్లబ్ స్ప్రే తాలూకు సువాసన. చూసే వాళ్ళ కళ్ళు చెదిరిపోయేలా అలంకరించుకురావడంలో కొందరు ఆడవాళ్ళు సిద్ధహస్తులు.

''మీ ఫార్మాలిటీస్...'' సంశయంగా అంది ఆమె కాగితాలు అందుకుంటూ.

''నో ఫార్మాలిటీస్.. మీరు నవ్వుతూ వెళ్ళడమే మా ఫార్మాలిటీ'' అన్నాను మనస్ఫూర్తిగా నవ్వి.

''అయితే ఇహ నేను నవ్వుతూ సెలవు తీసుకోవచ్చన్నమాట!'' అంది ఆమె మనోహరంగా నవ్వి.




''కాస్త టీ తీసుకుని.. అన్నయ్యా!''

అన్నయ్య అందించిన టీ చాలా రుచికరంగా ఉంది.

''కృతజ్ఞతలండీ! మీరు చేసిన సహాయం, మీ ఆతిథ్యం మరచిపోలేను. మీరోసారి మా ఇంటికి తప్పక రావాలి!'' అందామె టీ కప్పు, సాసర్లను టేబిలుమీద ఉంచుతూ.

''తప్పకుండా!'' అన్నాను.

''మీరు మాట వరుసకు అంటున్నారు. మీరు నిజంగా రావాలనుకుంటే మా ఇల్లెక్కడుందో అడిగి తెలుసుకునే వారు!'' అందామె కాస్త నిష్ఠూరంగా.

నేను గతుక్కుమన్నాను. కానీ రెండు క్షణాలలోనే తేరుకుని నవ్వేస్తూ నా పర్సనల్ డైరీ అందుకుని నేను రాసుకుని ఉండిన ఆమె ఫోను నెంబరును ఆమెకు చూపుతూ అన్నాను.

''మీ ఫోను నెంబరు నా వద్ద ఉంది. డైరెక్టరీలో ఈ నెంబరు ప్రక్కనే మీ ఇంటి చిరునామా ఉంటుంది. అందువల్ల మీ ఇంటికి రావడం పెద్ద కష్టం కాదు కదా?''

''ఐయాం సారీ... అంత ఆలోచన నాకు రాలేదు. మీరోసారి తప్పక రావాలి మా ఇంటికి!''

''తప్పకుండా!'' అన్నాను. 'ఈ స్టన్నింగ్ బ్యూటీని చూడటానికయినా తప్పక వస్తాను!' అని మనసులో అనుకుంటూ.

★ ★ ★

వారం రోజులకన్నా ఎక్కువ దూరం పొడిగించలేకపోయాను.

ఏం చేయను? నేనెంతో ప్రేమించే నా భార్యాపిల్లల స్థానాన్ని కూడా ఆమే పూర్తిగా ఆక్రమించుకుంది.

'ఎ థింగ్ ఆఫ్ బ్యూటీ ఈజ్ ఎ జాయ్ ఫర్ ఎవర్' అంటాడు జాన్ కీట్స్.

ఆరోజు సాయంత్రం ఆఫీసునుండీ నేరుగా ఆమె ఇల్లున్న కాలనీకేసి పోనిచ్చాను నా మోటారు సైకిల్ని. ఇల్లు కనుక్కోవడం పెద్ద కష్టం కాలేదు.

నేను కాలింగ్ బెల్ నొక్కిన తరువాత రెండు నిముషాలకు తలుపు తెరిచాడు ఓ స్ఫురద్రూపి అయిన నా సమవయస్కుడు.

''సార్, వసుధా మేడంగారున్నారా?'' అని ప్రశ్నించాను జాగ్రత్తగా.

''ఉన్నారు రండి!'' అంటూ లోపలికి నడిచాడతడు.

నన్నెలాంటి ప్రశ్నలూ అడక్కుండా ఆహ్వానించిన అతని సంస్కారం నాకు ఆనందాన్ని కలిగించింది.

''వసుధా.. నీకోసం ఎవరో వచ్చారు!'' అని స్వరం లోపలి గదుల్లో ఎక్కడ్నుండీనో విన్పించిన నిముషం తరువాత మెరుపులా మెరుస్తూ కన్పించింది ఆమె.. ''అరె.. అదేమిటి? నిలబడే వున్నారు? కూర్చోండి'' అంటూ.

నా రాక ఆమెకు ఆనందదాయకంగా ఉందని గ్రహించిన నేను నా సంకోచాన్ని వదిలిపెట్టి ఫ్రీగా కూర్చున్నాను.

తన భర్త ఆనందరావును నాకు పరిచయం చేసింది ఆమె.

''థాంక్యూ సర్! మా శంకర్రావుగారి పనిని సానుకూలం చేశారు!'' అన్నాడు ఆనందరావు.

''దాందేముంది సార్.. అది నా డ్యూటీ!'' అన్నాను.

అతన్తో మాట్లాడుతూ వసుధ అందించిన స్వీట్సు తింటూండగా అతని సెల్‌ఫోను రింగయింది. ఆ కాల్ రిసీవ్ చేసుకున్నాక ''సారీ! జంటిల్‌మన్. మళ్ళీ కలుద్దాం. నేను వెళ్ళాలి. ఫ్రెండ్స్ వెయిట్ చేస్తున్నారు!'' అనేసి ఆనందరావు చకచకా వెలుపలికి నడిచాడు. అతని స్కూటరు శబ్దం దూరం అవుతూండగా టీ కప్పులతో వచ్చిన ఆమెతో అన్నాను.

''వసుధ ఈజ్ ఎ లవ్లీ నేం! అన్నట్లు మీరు ఇంట్లో ఉన్నప్పుడు రాయల్ యూత్ క్లబ్ స్ప్రే ఉపయోగించరన్నమాట!''

''నిజమే!'' అంది ఆమె టీ కప్పు అందిస్తూ.

తరువాత ఏం మాట్లాడాలో తోచక ఆమె అందాన్ని కళ్ళతోటే జుర్రుకుంటూ టీ త్రాగసాగాను.

''అమ్మగారూ, పనంతా అయిపోయింది.. నేను పోతాను!'' అంది ఓ నడివయసు స్త్రీ హాల్లోకి వచ్చి.

''సరే... వెళ్ళు పాపమ్మా!'' అంది వసుధ.

పనిమనిషి పాపమ్మ వెళ్ళిపోయాక నెమ్మదిగా ప్రశ్నించాను.. ''మీ పిల్లలు?''

**ఆంధ్రభూమి-ఆటా పోటీలో ఎంపికైన కథ**

''ఇద్దరు...ఇద్దరూ మగపిల్లలే! విశాఖలో వాళ్ళ మేనమామగారి ఇంట్లో ఉన్నారు. అన్నయ్యకు పిల్లల్లేరు. మావారికి తరచు బదిలీ వస్తుంటుంది. అందువల్ల వాళ్ళక్కడే ఉండిపోయారు!''

''అయితే ఇంత పెద్ద ఇంట్లో..మీరిద్దరే!?'' అన్నాను నవ్వి.

''ఆ! ప్రస్తుతం మనమిద్దరం!'' అందామె కొంటెగా నవ్వేస్తూ.

నేను కొద్దిగా ఉక్కిరిబిక్కిరి అయ్యాను.

''రండి మా ఇల్లు చూద్దురు'' అంటూ ఆమె ఆహ్వానించడమే తడవు పసిడి కాంతి లాంటి ఆమె వెంబడి మబ్బునీడలా అడుగులేశాను.

చాలా పెద్ద ఇల్లు. వాళ్ళ బెడ్‌రూం అన్ని గదుల కన్నా చాలా పెద్దది. చాలా అందంగా, ఆకర్షణీయంగా డెకరేట్ చెయ్యబడి వుంది.

''చాలా ఆర్టిస్టిక్‌గా ఉంచుకున్నారు మీ పడక గదిని, మిమ్మల్ని అభినందించక తప్పదు!'' అన్నాను.

''అయితే కాస్సేపు ఇక్కడే కూర్చుందాము!'' అంటూ తను మంచం మీద కూర్చుని నా చేయి పట్టుకుని లాగడంతో నేనూ ఆమె ప్రక్కనే మంచం మీద కూలబడ్డట్లుగా కూర్చున్నాను.

ఆమె స్పర్శ గమ్మత్తుగా నా గుండె వేగాన్ని పెంచ సాగింది.

అర నిముషం మౌనం తరువాత ఆమె పైకి లేచి డ్రెస్సింగ్ టేబిలు వద్దకు వెళ్ళి ఓ బాటిలు తీసుకు వచ్చింది. అది రాయల్ యూత్ క్లబ్ స్ప్రే!

తను కొంత స్ప్రే చేసుకున్న తరువాత నామీద స్ప్రే చెయ్యడం మొదలుపెట్టింది అల్లరిగా.

నా నరనరాల్లో ఉద్వేగం మొదలయింది. ''వసుధగారూ ఏమిటిది?'' అన్నాను ఆమె చేతిని రెండు చేతులతో పట్టుకుని ఆపి.

''ఈ వాసన మీకు బాగా ఇష్టం అనిపించింది!'' అంది ఆమె స్ప్రే బాటిలు డ్రెస్సింగ్ టేబిలు వద్ద ఉంచేసి వచ్చి నా ప్రక్కనే నన్నానుకుని కూర్చుంటూ.

రెండు నిముషాల తరువాత ఆమె చేతులు నా భుజాల మీదున్నాయి. ఆపై నెమ్మదిగా జారి నన్ను అల్లుకుని హత్తుకునే ప్రయత్నం. ఆమె కళ్ళు వింతగా ప్రకాశిస్తున్నాయి.

కానీ..అంత పెద్ద ఇంట్లో, ఆ ఏకాంతంలో వేగవంతంగా చకచకా సాగుతున్న ఆమె ప్రతి చర్యా నాకెందుకో పదే పదే నా భార్య సుగాత్రి రూపం కళ్ళముందు కదిలేలా చేస్తున్నాయి. సుగాత్రి ప్రవర్తనా, నడవడీ మనసులో మెదలడమేగాక వికసిస్తున్న పువ్వుల్లాంటి నా పిల్లలిద్దరూ ఆ గదిలోనే చెరోమూలా నక్కి నిలుచుని నా ప్రవర్తనను వింతగా గమనిస్తున్నట్లుగా అనుభూతి చెందసాగాను.

ఫలితం...నా వైపునుండీ ఆమెకెలాంటి ప్రతిస్పందనా లభ్యం కాకపోవడం..అందుకు మరో కారణం..అక్కడ ఆ వాతావరణంలో నేనెందుకో ఇమడలేకపోవడం! బహుశా మరే మగవాడైనా సరే అందివచ్చిన ఆ అవకాశాన్ని ఏమాత్రం జార విడుచుకోడన్నది వాస్తవం!

పది నిముషాల తరువాత...

''కొంపదీసి మీరు మగవాళ్ళు కారా ఏమిటి?'' అందామె ఈసడించుకుంటున్నట్లుగా నన్ను వదిలిపెడ్తూ.

నిజానికి ఆ ప్రశ్న నాకు చాలా పెద్ద దెబ్బ. కానీ తమాయించుకుని ''మీ ప్రశ్నకు జవాబు నేను చెప్పుకోవడం కన్నా..నా భార్యనడిగి తెలుసుకుంటే సరయిన సమాధానం లభిస్తుంది!'' అన్నాను నవ్వి.

''సిగ్గు లేకపోతే సరి..వెళ్ళండి!'' అందామె జేవురించిన ముఖంతో.

నేను లేచి వెలుపలికి నడిచి హాల్లో నిలబడ్డాను. నిజానికి నా మనసంతా బ్లాంక్‌గా తయారయింది.

''ఇంకా ఇక్కడే ఉన్నారా?''

నిముషం తరువాత ఒకింత కర్కశంగా ఆమె స్వరం విన్పించడంతో వెనుదిరిగి దేవతాస్త్రీ లాంటి ఆమె రూపాన్నోసారి చూసి ఆ ఇంట్లోంచీ వెలుపలికి కదిలాను. నేను గుమ్మం దాటుతోండగా వ్యంగ్యం, ఆగ్రహం మిళితమైన స్వరంతో ఆమె అన్న మాటలు నా చెవిన బడకపోలేదు.

''బ్రతికిపోయావుపో!''

★ ★ ★

దాదాపు నలభై ఎనిమిది గంటల సమయం పట్టింది నేను కాస్త కుదుట పడడానికి. నా మనసు కొద్దిగా స్థిమిత పడినా బాధ, అశాంతి పూర్తిగా తగ్గలేదు. పైగా ఓ ప్రశ్నకు మాత్రం జవాబు లభ్యం కాలేదు ఎంత ఆలోచించినా. అందుకే ఆ సాయంకాలం ఆమెకు ఫోను చెయ్యకుండా ఉండలేకపోయాను.




''మీరా..అంతగా ఛీకొట్టి పంపించినా బుద్ధిరాలేదా మళ్ళీ ఎందుకు ఫోను చెయ్యడం..సిగ్గయినా లేకుండా?'' అందామె ఈసడించుకుంటూ.

''మీరెన్నయినా అనవచ్చు! కానీ ఓ ప్రశ్నకు నాకు సమాధానం కావాలి. అందుకోసమే మీచేత అవమానింపబడడానికి వెనుకాడ లేదు నేను'' అన్నాను.

''ఏమిటో అది?''

''నన్ను గెంటేసేప్పుడు ఓ మాటన్నారు మీరు.. 'బతికిపోయావు పో!' అని. అలా ఎందుకన్నారో తెలుసుకోవాలని!''

అరనిముషంపాటు అవతలి వైపు నిశ్శబ్దం.

''తెలుసుకుని ఏం చేస్తారు?''

''వృత్తిరీత్యా ఉద్యోగస్తుడ్నయినా ప్రవృత్తిరీత్యా రచయితని. తెలుసుకోవాలనిపిస్తోంది!''

ఫోను డిస్‌కనక్ట్ అయింది. మళ్ళీ ఫోను చేసినా ప్రయోజనం ఉండదనిపించింది..ఆ ప్రయత్నం మానుకున్నాను.

★ ★ ★

గాయం చిన్నదే కావచ్చు కానీ తగిలిన విధానం పెద్దది కావటాన మానుపట్టడానికి దాదాపు రెండు నెలలు పట్టింది. ఆ తరువాత మరిచిపోగలిగాను.

ఆరోజు సాయంకాలం నాలుగు గంటల ప్రాంతంలో బాగా బిజీగా ఉండగా వచ్చిందా ఫోను కాలు.

''రాజారావు హియర్!'' అన్నాను కాస్త విసుగ్గా.

''నేను..వసుధని!''

నా రక్తంలో కొద్దిపాటి సంచలనం...మనసులో మరుగున పడిపోతున్న నీలినీడలలో కూడా చిన్న కదలిక.

''చెప్పండి!''

''సాయంకాలం మీరోసారి మా యింటికి రాగలరా?''

నాకు నవ్వొచ్చింది. ''మళ్ళీ ఛీ కొట్టించుకుని వెలుపలికి రావడానికా?''

''కాదు. మీ ప్రశ్నకు జవాబు తెలుసుకోవడానికి!''

''సాయంత్రం సరిగ్గా ఆరున్నరకు మీ ఇంటి గుమ్మంలో ఉంటాను'' అని చెప్పి ఫోను పెట్టేశాను.,

★ ★ ★

కాలింగ్‌బెల్ నొక్కాల్సిన అవసరం లేకుండా గుమ్మంలోనే ఎదురు చూస్తోంది ఆమె. చిరునవ్వుతో, రాయల్ యూత్ క్లబ్ పెర్ఫ్యూం సువాసనలతో! ఇల్లంతా నిర్మానుష్యంగా ఉంది!

నా చేయి పట్టుకున్న ఆమె నన్ను నేరుగా బెడ్‌రూంలోకే తీసుకెళ్ళి తన

ప్రక్కనే కూర్చోబెట్టుకుంది. నాకెందుకో ఆశ్చర్యం కలుగలేదు కానీ నరనరాల్లో స్పందన మాత్రం ఆగడం లేదు.

''మీ ప్రశ్నకు జవాబు చెప్పేముందు..నాదో చిన్న ప్రశ్న..మీ అరచేతులలోనికి అనువుగా వచ్చేసిన నన్ను అలా వదిలెయ్యడానికి కారణం ఏమిటో తెలుసుకోవచ్చా?''

''కారణమంటూ ఏమీలేదు. మీ ప్రవర్తన ఎంత ఫాస్టుగా ఉందో అంతే వేగంగానూ సంస్కారవతీ, సౌశీల్యవతీ, అయిన నా భార్య పిల్లలూ కూడా నా కళ్ళముందు నిలబడి నన్ను కట్టడి చేశారు.'' అన్నాను.

ఎందుకో ఆ క్షణాలలో ఆమె కళ్ళలో తడి కన్పించింది.

''అదృష్టవంతులు'' అందామె సర్దుకుంటూ.

''థాంక్స్..ఇంతకూ నేను బతికిపోవడమేమిటి?''

''చెపుతాను!'' అంటూ ఆమె మంచం మీద వయ్యారంగా పడుకుని...''ఈ పడకమీద నేనెలా ఉన్నాను'' అని ప్రశ్నించింది.

''స్వర్గం నుండీ దిగివచ్చిన అప్సరసలా ఉన్నారు!'' అన్నాను.

''నా రక్తంలో హ్యూమన్ ఇమ్యూనో డెఫిషియన్సీ వైరస్ ప్రవహిస్తోందంటే మీరు నమ్మగలరా?'' నేను ఉలిక్కిపడ్డా ఆమెకేసి చూశాను.

''నిజానికి ఈ రహస్యం నాకు తప్ప ఇతరులెవ్వరికీ...చివరికి నా భర్తకు కూడా తెలియదు! అర్థమయిందా? మీరెలా బ్రతికిపోయారో?''

''నేను నమ్మను..నమ్మలేను. మీలో హెచ్.ఐ.వి.యా?'' అన్నాను కొద్దిగా తడబడి.

''నమ్మక తప్పదు! ఈ రహస్యం నాతోనే అంతం కావాలనుకున్నాను. కానీ మీరు నా నుండీ తప్పించుకోవడం, మానసికంగా గాయపడి వెళ్ళి మళ్ళీ ఫోను చేసి రచయితనని చెప్పుకుంటూ ప్రశ్నించడం...ఇవన్నీ ఎందుకో నన్ను చాలా ఆలోచింపజేశాయి!'' అందామె.

నిస్సంకోచంగా, నేనామె పాదం మీద చెయ్యి వేసి అన్నాను..''దయచేసి చెప్పండి''

''ఛ! ఇదేమిటి?'' అంటూ తన కాలు లాక్కున్న ఆమె లేచి కూర్చుని నాకేసి చూస్తూ ఓ జీవం లేని నవ్వు నవ్వి మొదలుపెట్టింది.

''వాస్తవానికి నా భర్త చాలా మంచివారు. పెద్దలు మిగిల్చిన ఆస్తిపాస్తులకు తోడు రెండు చేతులా సంపాదన కలిగిన ఉద్యోగం! ఏలోటూ లేని కుటుంబం మాది.

మారిపోతున్న కాలంలోని ఫాస్టు కల్చర్, విపరీతమైన ఫ్రెండ్స్ సర్కిల్స్..ఆయనలో చాలా మార్పులు తెచ్చాయి.

నాగరికత ముసుగులో అనాగరిక, అసాంఘిక కార్యాలెన్నో ఎక్కువయిపోతున్నాయి. వాటిల్లో అతి పాశవికమైనది భార్యలను తాత్కాలికంగా మార్చుకునే జబ్బు. ఆ జబ్బు నా భర్తనూ పట్టుకుంది.

మొదట్లో చాలా ప్రతిఘటించాను. కానీ నా ప్రతిఘటన అట్టేకాలం కొనసాగలేదు.

డిన్నర్ పేరిట స్నేహితులు కొందరు భార్యలతో కలిసి ఒకరి ఇంటికి వెళ్ళి ఆ రాత్రి అక్కడే ఉండిపోవడం..అక్కడే జంటలు మారడం ఓ ఫ్యాషన్ కల్చర్ అపోయిందని గ్రహించాక, ఆ కల్చర్ ఇహ నా ఇంట్లో కూడా అడుగు పెట్టబోతున్నదని తెలిశాక ఆ నీడలు నా పిల్లల మీద పడకుండా వారిని విశాఖలోని అన్నయ్య ఇంట్లో ఉంచేశాను.

ఒక్క ఊర్లోనే కాదు. బదిలీలతో ఊర్లు మారినా కూడా ఈ అనుభవాలు ఎదురవుతూనే వచ్చాయి నాకు. కొన్ని చోట్లయితే ఎంత రాక్షసంగా గడుస్తుందంటే..ఒక గదిలో రెండు జంటలు. లైట్లయినా ఆర్పకుండా..దుస్తులయినా లేకుండా..

ఎక్కడ ఎవరి ద్వారా లభ్యమైందో..లేక నా భర్తకు లభించి తద్వారానే నాకు ప్రాప్తించిందో చెప్పలేను కానీ ఓసారి ఏదో నలతతో డ్యాక్టర్ వేదవ్యాస్ క్లినిక్‌కు వెళ్ళినప్పుడు బ్లడ్ టెస్ట్ రిజల్టులో మిసెస్ వేదవ్యాస్‌కు అనుమానం కలిగింది. ఆమె అనేక టెస్టులు చేసి ఇంక్యుబేషన్ పీరియడ్ దాటి హెచ్.ఐ.వి కన్‌ఫర్మ్‌గా తెలుస్తున్నది కాబట్టి నా భర్తను తీసుకురావాలనీ, ఆయనకూ టెస్టులన్నీ చేయాలనీ తెలిపింది.

నా ఆశ్చర్యానికి అంతులేదు. నన్ను కబళించబోయే ప్రాణాంతక వ్యాధి నా శరీరంలో స్థిరపడ్డున్నా నేను మామూలు మనిషిలాగే జీవిస్తున్నాను. జీవన విధానంలో కూడా ఏ లోపం లేదు. కొద్ది పాటి నీరసం తప్ప.

నా భర్త కూడా అంతే! చలాకీగా, మూడు పువ్వులు ఆరు కాయలుగా జీవించేస్తున్నాడు. మాలాంటి వారిని 'కేరియర్స్' అంటారని మిసెస్ వేదవ్యాస్ ద్వారానే తెలిసింది నాకు.

నేనిక పూర్తికాలం జీవించబోనే కఠోరమైన సత్యం తెలిశాక నాలో ఏదో కసి పెరిగింది. మనుషుల్ని ప్రాణాంతక వ్యాధుల బారిన పడవేస్తున్న అసాంఘిక స్త్రీ పురుష సంబంధాలపట్ల ఏవగింపు, జుగుప్సలతోపాటు తెగింపును కూడా తెచ్చిపెట్టింది. నిజానికి ఈ వ్యాధికి మూలకారణం పురుషులు. కానీ వారితోపాటు నలిగి నశించిపోతున్నది స్త్రీలు.

నా ఈ పతనానికి, రాబోయే అకాల దుర్మరణానికి కారణం నేను కాదు. నా భర్త! లేదా అతి అనుభవాలను కోరుకునే అతని మిత్రులు. వారి భార్యలు..అలాంటి వారెవరో! ఎందరో!!

అందుకే పగ తీర్చుకోవాలనిపించింది.

నా భర్తకు ఈ విషయమే తెలియనివ్వలేదు. అంతేకాదు..ఆపై అతని ఇష్టాలకు ఏనాడూ అడ్డు చెప్పలేదు.

మేమిద్దరమే కాదు మాతో పాటు మరెందరో మేం అనుభవించబోయే బాధలు అనుభవించాలి. అంతేకాదు మాతోపాటు కాస్త ముందు వెనుకలుగా మరో లోకాలకూ రావాల్సిందే!

నా పూర్తి వివరాలు డ్యాక్టర్ వేదవ్యాస్ దంపతులకు తెలియకపోవడం వల్లా, కొద్దిరోజుల్లోనే మావారికి ఆ ఊరినుండీ బదిలీ కావడం వల్లా నా రహస్యం నాలోనే దాగిపోయింది. చివరికీనాటికీ నా భర్తకు కూడా తెలియకుండా..''

ఆమె చెప్పడం ముగించి చాలా సేపయింది.

భయంకరమైన నిశ్శబ్దం. పైగా చీకటి ఎప్పుడు పడిందో కూడా తెలియని స్థితిలో ఒకరికొకరు ఆనుకుని కూర్చుండిపోయాం. విశాలమైన ఆ పడక గదిలో మంచంమీదే!

''చెప్పండి..మీరు బ్రతికిపోయారో లేదో?'' ఆమె స్వరం విన్పించడంతో ఆమె ఏడుస్తున్నదని నాకు అనుమానం కలిగింది.

చీకట్లోనే ఆమెను చేతుల్లోకి తీసుకుని నిస్సంకోచంగా ఆమె కన్నీళ్ళు తుడిచాను. ఆమె నా ఎదమీద తలవాలుస్తోంటే నా పిల్లలు అలా నామీద వాలేటప్పటి అనుభూతే కలిగింది.


''మీ కసి, ద్వేషాలను అర్థం చేసుకోగలను నేను. కానీ వాటిలో పడిపోయి ఒక ముఖ్యమైన, అతి విలువైన విషయాన్ని విస్మరించారు మీరు!'' అన్నాను అనునయంగా.

''ఏమిటది?''

''సామాజిక బాధ్యత!''

''ఎలా?''

''ఎలా అన్నది తెలియకపోవడం వల్లే మీరు సామాజిక బాధ్యతను గూర్చి ఆలోచించలేకపోయారు. ఒక్క ప్రశ్న అడుగుతాను చెప్పండి. హీరో



షిమా, నాగసాకీల మీద అణుబాంబులు పడిన పిదప జరిగిందేమిటి?''

''విధ్వంసం! మారణహోమం!''

''మామూలు విధ్వంసం కాదు. అసంఖ్యాకమైన మరణాలనలా ప్రక్కన పెడ్తే జీవించిన వాళ్ళు సైతం జీవచ్ఛవాలలా బ్రతకాల్సి వచ్చింది. దశాబ్దాల తరబడి ఘోరంగా. నేటికీ అక్కడ వికలాంగులకు జన్మలనిస్తున్న తల్లులున్నారంటే విధ్వంసం ఎంత తీవ్రస్థాయిలో కాలం మీద సైతం తన ప్రభావాన్నెలా చూపగలిగిందో తెలుసుకోవచ్చు!''

''తెలుసు..అయినా ఇదంతా నాకెందుకు చెప్తున్నారు?'' అందామె.

''మీరు సైతం అలాంటి విధ్వంసాన్నే సృష్టించబోతున్నారు. ఇప్పటికే మీ వల్లా, మీ భర్తవల్లా తెలిసో, తెలియకో మీకూ మీ భర్తకూ ఈ స్థితిని తెచ్చి పెట్టిన వారివల్లా, ఇప్పటికే ఎంతోమంది ఈ జబ్బు బారిన పడివుంటారు. ఎందుకంటే సామాజిక కట్టుబాట్లు తెంచుకుని విశృంఖలంగా జీవితం గడిపేవారివల్ల ఇలాంటి విధ్వంసాలు తప్పవు!

దీనిబారిన పడిన వారిలో చాలామంది తను సంతతికి ఆ సంతతి ద్వారా ఈ సమాజానికి ఈ జబ్బును శాశ్వత ప్రాతిపదికన అందజెయ్యగల ప్రమాదం కూడా ఉంది. తరాల తరబడి మనుషులను వెన్నంటి తరముగల భయంకరమైన ఈ విషయాన్ని 'కసి' అనబడే రెండక్షరాల పదం తాలూకు ఆలోచనలతో మీరు చాలా తేలికయిన రీతిలో తీసుకుని సమాజానికి చాలా అన్యాయం చేశారు!'' అన్నాను.

ఆమె దుఃఖం అధికమైంది.

ఐదారు నిముషాల తరువాత ''నేనేం చెయ్యను?'' అందామె కాస్త తేరుకుని.

''చెయ్యవలసింది చేసేశారు. కానీ..మీరు చెయ్యగలిగింది కూడా చాలా ఉంది..మొదట దీపాలు వెలిగించి ఈ చీకటిని పారదోలండి!'' అన్నాను.

ఐదు నిముషాలలో ఇల్లంతా దీపాలు వెలిగాయి.

తరువాత వంటగదిలో ఇద్దరం కలిసి మంచి టీ తయారు చేసుకుని హాల్లోకి తెచ్చుకుని కూర్చున్నాము.

వేడి వేడి టీ కడుపులో పడ్డాక నేనూ కొంత తేరుకున్నాను.

''మీ శ్రీవారెప్పుడొస్తారు?'' అన్నాను.

''ఊర్లోలేరు''

''అది తెలుస్తూనే ఉంది. అతడు రాగానే మొట్టమొదట మీరు చెయ్యాల్సిన పని ఏమిటో తెలుసా?''

''తెలియదు!..చెప్పండి!!''

''మొదట అతనికి వాస్తవం తెలియనివ్వండి. ఇద్దరూ కలిసి వైద్యసేవలు పొందండి. వీలయినంత ఎక్కువ కాలం...అంటే కనీసం రెండు మూడు దశాబ్దాలు జీవించే ప్రయత్నాలు చెయ్యండి!'' అన్నాను.

''మేం అంతకాలం జీవించగలమా?'' అందామె నిర్ఘాంతపోతూ!

''ఎందుకు జీవింపకూడదు? అవగాహనా రాహిత్యం వల్ల చాలామంది హెచ్.ఐ.వి. సోకగానే త్వరలో మరణిస్తామని భావిస్తుంటారు. అది చాలా తప్పు. అసలు ఇంక్యుబేషన్ పీరియడే ఒక్కోసారి రెండు నెలల నుండీ పది సంవత్సరాల వరకూ కూడా కొనసాగగల అవకాశం ఉంది. ఆ పీరియడ్ త్వరగా పూర్తయిపోయి హెచ్.ఐ.వి. కన్‌ఫర్మ్ అయినంత మాత్రానా వెంటనే ఎయిడ్స్‌కు గురయి మరణిస్తారనేది తప్పు ఆలోచన. హెచ్.ఐ.వి. ఆయా వ్యక్తులలో ప్రవేశించే విధానం, శరీర తత్వం...అంటే జన్యు నిర్మాణం, ఆహార నియమాలు, శరీర సౌష్టవం తాలూకు స్థితి, వయసు.. ఇలా ఎన్నో అంశాల మీద ఆధారపడి ఆరోగ్యం క్షీణిస్తూ రావడం జరుగుతుంది.

కొన్ని దేశాలలో జరిపిన పరిశోధనల తాలూకు నివేదికల ప్రకారం హెచ్.ఐ.వి. సోకిన వారిలో 5 నుండీ 12 శాతం మంది 5 సంవత్సరాలలోపు, 24 నుండీ 45 శాతం మంది 10 సంవత్సరాలలోపు, మిగిలిన శాతం మనుష్యులు 15 సంవత్సరాల లోపు ఎయిడ్స్‌కు గురవుతున్నట్లు తెలుస్తోంది. అతి కొద్దిమందిలో అయితే 15 సంవత్సరాల తరువాత కూడా ఎయిడ్స్ లక్షణాలు బహిర్గత పడడం లేదు.

ఇరవయ్యవ శతాబ్దంలో హెచ్.ఐ.వి. వైరస్ చింపాంజీల నుండీ ఒక రకమైన ఈగల ద్వారా మానవులలోకి ప్రవేశించి ఉండవచ్చునని జర్మన్ సైంటిస్టులు న్యూ సైంటిస్ట్ పత్రికలో ప్రచురించారు. కానీ ఇప్పుడు ఈ వైరస్ తొంభయి శాతం వరకూ అనైతిక శృంగారం మూలంగానే వ్యాప్తి చెందుతోంది. రక్తమార్పిడి, స్టెరిలైజ్ చెయ్యని సూదులు మొదలైనవి రెండు నుండీ ఐదు శాతం వరకూ కారణమవుతున్నాయని భావిస్తున్నారు.

ఈ విషయాన్ని ఇతరులకు తెల్పాల్సిన అవసరం లేదు నిజానికి. ఆత్మస్థయిర్యాన్ని కోల్పోకుండా వైద్యుల సూచనలతో, సలహాలతో మందులు తీసుకుంటూ కొన్ని జాగ్రత్తలు పాటిస్తే రెండు మూడు దశాబ్దాలు జీవించడం పెద్ద కష్టం కాకపోవచ్చు'' అంటూ ఆగాను.

ఆమె ముఖంలో కొత్త ఉత్సాహం కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

''ఒకప్పుడు ప్రాణాంతక వ్యాధులైన వాటికెన్నింటికో నేడు సునాయాసంగా విముక్తి కలిగించే మందులూ, పరికరాలూ ఉన్నాయి. ఉదాహరణకు..టి.బి., కేన్సర్..ఇలా.. హెచ్.ఐ.వి. శరీరంలో ప్రవేశించినా నియంత్రించడానికి, ఎయిడ్స్‌కు గురయినా కూడా ప్రాణాలు కాపాడడానికి 'లైఫ్ సేవింగ్ డ్రగ్స్' కోసం నిరంతర పరిశోధనలు జరుగుతున్నాయి. బయోటెక్నాలజీ అభివృద్ధి చెందిన ఈ ప్రపంచంలో ఎవరో ఒకరు త్వరలోనే దానికి కనుక్కోక పోరు!

ఈమధ్యన మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం వైద్య నిపుణుడు రోజర్ ష్టార్ట్ నిమ్మరసానికి హెచ్.ఐ.వి వైరస్‌ను నశింపచేసే శక్తి ఉందని ఆస్ట్రేలియా బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ టెలివిజన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

మూడు వందల సంవత్సరాల క్రితం గర్భనిరోధకంగా ఉపయోగింపబడిన నిమ్మరసం నేడు ఎయిడ్స్ వ్యాప్తికి కారణమైన హెచ్.ఐ.వి. వైరస్‌ను నశింపచెయ్యగల గుణం కలిగి ఉందని ఆస్ట్రేలియా శాస్త్రవేత్తలు అంటున్నారు.

కాబట్టి మనో నిబ్బరాన్ని అలవరచుకుని మీరు, మీ భర్తా జీవించండి, మీ పిల్లలకోసం కలకాలం! మిమ్మల్ని కాపాడడానికి భగవంతుడున్నాడు. మీలాగే ఈ బాధలో ఉన్న వారందరికీ మీరు ఆత్మవిశ్వాసాన్ని కలిగించండి! మనుషులుగా అది మీ బాధ్యత!'' అన్నాను ఆమెలో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచి పెద్దచేసే ప్రయత్నంలో.

తరువాత కూడా గంటపాటు నేను చేసిన సూచనలు, సలహాలు అన్నీ ఓపికగా వింది ఆమె వంట గదిలో వంట చేస్తూ.

ఇద్దరం కలిసి భోజనం చేశాక..అంత పెద్ద ఇంట్లో ఆమెను ఒంటరిగా వదిలి వెళ్ళడానికి చాలా బాధ కలిగింది.

అయినా తప్పదు..నాకోసమే ఎదురు చూస్తున్న వారున్నారు కదా? ఎవరిదారిన వారు నడవాల్సిందే!

నా మోటారు సైకిలు నన్ను మోసుకుంటూ బయల్దేరింది వేగం పుంజుకుంటూ. అప్పుడు మాత్రం అప్రయత్నంగా నా కళ్ళనుండీ కన్నీటి చుక్కలు జారిపోవడం మొదలుపెట్టాయి. ☆

